క్లుప్తంగా

28న డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్ నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్(0863–2224202)లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలు తమ స్థానిక సమస్యలైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సచివాలయ సేవలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 0863–2224202 నంబర్‌కి కాల్ చేసి నేరుగా కమిషనర్ దృష్టికి తమ సమస్యను తెలియజేయవచ్చన్నారు.

గుంటూరుకు చేరిన మాదిగల కృతజ్ఞత యాత్ర

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణకు అండగా నిలుస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ చెప్పారు. రాష్ట్రంలో వర్గీకరణ సాధన దిశగా ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఆగస్టు 16 నుంచి హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రారంభమైన మాదిగల కృతజ్ఞత యాత్ర శుక్రవారం గుంటూరుకు చేరింది. ఈ మేరకు లాడ్జిసెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. కార్యక్రమంలో నవ్యమాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేజేండ్ల సుబ్బారావు, కె.వెంకట్రావు, అశోక్, బసవరాజు, కిరణ్ పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ



పట్నంబజారు: వస్త్ర దుకాణంలో చోరీ ఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. పాతగుంటూరుకు చెందిన యల్లావుల అశోక్, ఉమెన్స్ కళాశాల రోడ్డులో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి ఎప్పటిలాగానే దుకాణాన్ని మూసి వెళ్లిపోయాడు. తిరిగి శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా షాపులో దుస్తులు కనిపించకపోవడం గమనించాడు. రూ.2 లక్షల విలువ చేసే దుస్తులు చోరీకి గురైనట్లు గుర్తించాడు. సీసీ పుటేజ్‌లో చోరీ చేసిన నిందితులు స్పష్టంగా కనబడింది. దుస్తులతోపాటు కొద్ది మేర నగదు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

లక్ష్మీపురం: తల్లిని కొడుకు డబ్బులు అడగటంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగి తల్లి ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావుపేటకు చెందిన కుంచనపల్లి మాధవి భర్త మృతి చెందాడు. వీరికి కుమారుడు వినయ్ ఉన్నాడు. అయితే వినయ్ తల్లి మాధవిని ఈనెల 21వ తేదీన డబ్బులు అడగటంతో తల్లికి కొడుకు మధ్య వాగ్వివాదం జరిగింది. అదే రోజు మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి వచ్చిన కుమారుడికి విషయం తెలియడంతో చుట్టు పక్కల ప్రాంతాలలో, బంధువులు, సన్నిహితుల ఇళ్ల వద్దకు వెళ్లి వెతికిన కనిపించలేదు. దీంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు. మాధవి ఆచూకి తెలిసిన వారు సీఐ నగరంపాలెం 8688831336 నంబర్‌కు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

ఎరువుల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాం ఫాం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘం ప్రతినిధులకు సమగ్ర యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు శుక్రవారం తరగతులు నిర్వహించారు. 15 రోజులపాటు జరిగే ఈ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవాన్ని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(ఏడీఆర్) డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, సమేతి, మేనేజ్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఎరువుల వాడుకలో మెలకువలు, జాగ్రత్తలు, ప్రాథమిక సంఘాల ద్వారా రైతులకు సమాచారం వెంటనే చేరుతుందన్నారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి శిక్షణ తరగతుల ద్వారా ఎరువుల యాజమాన్యం, జాగ్రత్తలు, నేల ఆరోగ్య పరిరక్షణ అనే అంశాలపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి.ముకుందరావు, డాక్టర్ వి.విశాలక్ష్మి, ఎం.వెంకటరాములు పాల్గొన్నారు.

ఊబకాయులు పెరిగిపోతున్నారు...

- నేడు వరల్డ్ ఒబెసిటి డే
- ఆధునిక జీవనశైలితో అవస్థలు
- అధికబరువు అనర్థాలకు కారణం



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన విధానం, మారిన ఆహారపు అలవాట్లుతో పాఠశాల చదివే పిల్లవాడు మొదలుకొని యువకులు, పెద్దల వరకు అన్ని వయస్సుల్లోనూ అధిక బరువుతో(ఊబకాయం) బాధపడుతున్న వారి సంఖ్య నానాటికి పెరిగిపోతుంది. ప్రపంచ ఊబయాక ఫెడరేషన్ నివేదిక ప్రకారం 2030 నాటికి 250 మిలియన్ల మంది 5 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు ఊబకాయులుగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 2.8 మిలియన్స్ మంది ప్రజలు ఊబయాకం వల్ల చనిపోతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా అక్టోబర్ 26న వరల్డ్ ఒబెసిటి డే నిర్వహిస్తున్నారు.

బరువు పెరగటానికి కారణాలు...

అధికంగా తినటం వలన బరువు పెరుగుతారని అందరూ అనుకుంటారు. అది పూర్తిగా తప్పు. తిన్నది అరగకపోవటం వల్లే బరువు పెరుగుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. శాక్రిన్‌తో ఉన్న తీపి పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్స్ ఊబకాయానికి కారణమవుతున్నాయి. శరీరానికి సరైన వ్యాయామం లేకపోవటం వలన కొవ్వు పేరుకుపోతుంది. అది క్రమంగా పెరిగి శరీర బరువును పెంచేస్తుంది. ఎక్కువ సేపు టీవీలకు అతుక్కుపోవటం, జన్యుపర కారణాలు, కుటుంబంలో ఒకరికి ఊబకాయం ఉంటే, కొన్ని రకాల మందుల వలన, స్మోకింగ్, కంటికి సరిపడా నిద్రలేకపోవటం, స్మార్ట్‌ఫోన్‌లతో అధిక సమయం గడిపేయటం, స్వీట్స్, జంక్ ఫుడ్స్ తీసుకోవటం, ఆహార నియమాలు పాటించకపోవటం వలన ఊబకాయం బారిన పడుతున్నారు. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఆకస్మికంగా బరువు పెరుగుతారు.

ఇతర రోగాలు వస్తాయి...

ఊబకాయంతో అధిక రక్తపోటు, హార్ట్‌అటాక్, బ్రెయిన్ స్ట్రోక్, మధుమేహం, కిడ్నీ వ్యాధులు, ఆస్టియోపొరాసిస్, స్లీప్ అప్నీయా, రొమ్ముక్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, ఓబరీస్ క్యాన్సర్, లివర్ క్యాన్సర్, గాల బ్లాడర్ క్యాన్సర్ ఇతర వ్యాధులు కూడా వస్తాయి. సంతానం కలుగదు. ఆడవారిలో పీసీఓడీ సమస్యలు వస్తాయి. పిల్లల్లో అధిక రక్తపోటు, బ్రీతింగ్ సమస్యలు, సైకలాజికల్ సమస్యలు, ఫ్రాక్చర్లు ఏర్పడతాయి. కాబట్టి అధిక బరువును తగ్గించుకోవాలి.

జిల్లాలో బాధితులు...

జిల్లాల్లో ఐదుగురు బేరియాట్రిక్ సర్జన్స్ ఉన్నారు. ఒక వైద్యుడి వద్దకు నెలకు 100 నుంచి 200 మంది అధిక బరువు బాధితులు చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి....

ప్రతి ఒక్కరు వయస్సు, ఎత్తుతో బరువును సరి చూసుకోవాలి. బరువు పెరిగితే తగ్గటం కోసం వ్యాయామం చేయాలి. కింద కూర్చుని భోజనం చేయటం అలవాటు చేసుకోవాలి. రెండు గంటల తర్వాత మాత్రమే నిద్రకు ఉపక్రమించాలి. అలా చేయటం వల్ల మెలకువగా ఉన్నప్పుడే తిన్న ఆహారం అరిగిపోతుంది. అధిక బరువు ఉంటే ఆహారం తీసుకునే ముందు ఒక అరటి పండు తినాలి. ఒక స్పూన్ తేనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి నిద్ర లేచిన వెంటనే తాగటం అలవాటు చేసుకోవాలి. కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్, ఫాస్ట్‌ఫుడ్ విషయంలో నియంత్రణ పాటించాలి. ఏదో ఒక ఆటను ఆడటం అలవాటుగా చేసుకుంటే రోజూ వ్యాయామంలాగా ఉపయోగపడుతుంది. భోజనంలో ఆకు కూరలు ఉంటే చాలా మంచిది. అన్నంలో కూర ఎక్కువగా తీసుకోవాలి.



కడుపులో ఎండోస్కోపి ద్వారా బెలూన్ అమర్చుతున్న డాక్టర్ ఆళ్ల సిద్ధార్థరెడ్డి(ఫైల్)

బెలూన్ చికిత్సతో సులువుగా బరువు తగ్గవచ్చు

బెలూన్ చికిత్సతో అతి సులువుగా బరువు తగ్గవచ్చు. ఎలాంటి కోత, కుట్లు లేకుండా బరువు తగ్గేందుకు ఈ చికిత్స అందుబాటులో ఉంది. ఇన్‌ట్రా గ్యాస్ట్రిక్ బెలూన్ – స్పాడ్జ్ –3 చికిత్స విధానంలో కడుపులో బెలూన్ అమర్చుతాం. మిథలిన్ బ్లూతో కలిపిన డిస్టల్ వాటర్‌ను బెలూన్‌లో నింపి ఎలాంటి కోత, కుట్లు లేకుండా ఎండోస్కోపి ద్వారా కడుపులో పెడతాం. బెలూన్ పెట్టిన నెలరోజుల వ్యవధిలో పది కిలోల బరువు తగ్గుతారు. ఈ చికిత్సా విధానం చేసేందుకు కేవలం పది నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా బరువు తగ్గాలనుకునేవారికి బెలూన్ చికిత్స ఎంతో ఉపయోగకరం.

– డాక్టర్ ఆళ్ల సిద్ధార్థరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

ఊబకాయులకు శ్వాసకోశ సమస్యలు...



అధిక బరువు ఉన్న వ్యక్తి గుండె, ఊపిరి తిత్తులు, కిడ్నీలు, లివర్ సాధారణం కంటే రెట్టింపు పనిచేయాల్సి ఉంది. త్వరగా అలసి పోతారు. ఛాతిలో పేరుకున్న కొవ్వుతో శ్వాసకోశ సమస్యలు, బ్రాంకైటిస్ వస్తాయి. ఊబకాయంతో శరీరంలో పెరిగిన కొవ్వు వలన హైపర్ ఇన్సులిమియా సంభవిస్తుంది. దీని వల్ల మధుమేహం వస్తుంది. ఊపిరితిత్తుల్లో రాళ్లు ఏర్పడతాయి. రోగ నిరోధక శక్తిని ఊబకాయం తగ్గిస్తుంది. ఇది ఊపిరితిత్తులపై ఒత్తిడి పెంచుతుంది.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

కలేకూరి ప్రసాద్‌కు ఘన నివాళి



నెహ్రూనగర్: దళిత బహుజన సిద్ధాంత హక్కుల కోసం విప్లవ ఉద్యమ నాయకుడిగా ఎదిగి కవులకు, కళాకారులకు ఆదర్శంగా నిలిచిన గొప్ప కవి కలేకూరి ప్రసాద్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం అరండల్ పేటలోని సంఘ కార్యాలయంలో కలేకూరి 53వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సమాజంలో దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమకారుడిగా, రాజకీయ విశ్లేషకుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయినట్లు చెప్పారు. హిందూ మతోన్మాద, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పిడికిలి బిగించిన ఉక్కు మనిషి కలేకూరి అని కొనియాడారు. కారంచేడు ఉద్యమం నుంచి నేటి లక్ష్మీపేట పోరాటం వరకు క్రియాశీలకంగా అన్ని దళిత ఉద్యమాల్లో తన వంతు ఉద్యమ సహకారిగా కలేకూరి కొనసాగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, శిఖా సురేష్, కోటేశ్వరరావు, తాటికొండ నరసింహరావు, ముత్తయ్య, కైలా జయసుధ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నెహ్రూనగర్: ఎన్డీఏ ప్రభుత్వం శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి దానిని ఆమోదింపజేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఏసుబాబు తెలిపారు. శుక్రవారం కాకాని రోడ్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దళితుల్లో అత్యధికంగా వెనుకబడిన కులాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో మందకృష్ణ మాదిగ చేస్తున్న వర్గీకరణ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. సమావేశంలో సంఘ నాయకులు సుబ్బయ్య, మక్కెన ప్రభాకర్, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



కార్పొరేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి పనులు నిర్దేశిత షెడ్యూల్ మేరకు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ స్థానిక రత్నపురికాలనీ, మల్లికార్జునపేట, శారదా కాలనీ ఎక్స్ టెన్షన్, బొంగరాలబీడు గ్యాస్ దహన వాటిక, సంజీవయ్య నగర్, రత్నగిరి నగర్ పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ పాట్ హోల్స్ మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పనులు జాప్యం జరిగితే ప్రజలు అసౌకర్యానికి గురవుతారని, ఇంజినీరింగ్ అధికారులు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. మల్లికార్జునపేటలో నివాసాల మధ్య గార్బేజ్ వల్నర బుల్ పాయింట్స్ ఉండడం గమనించి, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. రత్నపురి కాలనీలో అవుట్ ఫాల్ డ్రెయిన్ వ్యర్థాలతో ఉండడం చూసి వెంటనే సిల్ట్ కార్మికుల ద్వారా తొలగించాలని ప్రజారోగ్య అధికారులను, డ్రెయిన్‌పై ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళికాధికారులను కోరారు. బొంగరాలబీడు మహా ప్రస్థానంలో 14 ఫైనాన్స్ నిధులతో నిర్మాణం చేసిన గ్యాస్ దహన వాటికను పరిశీలించి, వినియోగంలోకి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏఈకి సూచించారు. సంజీవయ్య నగర్ రైల్వే ట్రాక్ దగ్గర రోడ్ ఆక్రమణలను తొలగించడం, పెండింగ్ విస్తరణ పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గోరంట్లలో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన భవనాలను పరిశీలించి, నిర్మాణదారులు నిబంధనల మేరకు నిర్మాణాలు చేసుకోవాలని, నిబంధనలు పాటించని వాటికి తదుపరి అనుమతులు జారీ చేయడం నిలిపివేస్తామని హెచ్చరించారు. అనంతరం పెద్దపలకలూరు రోడ్ లోని రత్నగిరి నగర్‌లో తాగునీటి సరఫరాపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ అధికారులతో కలసి పర్యటించి, స్థానికులతో మాట్లాడి, వారం రోజుల నుంచి పైప్ లైన్ ద్వారా తాగునీటి సరఫరా జరగడం లేదని స్థానికులు తెలపగా తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తక్షణమే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ట్యాంకర్ల డ్రైవర్లు డబ్బులు అడుగుతున్నారని స్థానికులు తెలపగా అటువంటి వారి పై క్రిమినల్ కేసులు ఫైల్ చేయాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, ఈఈ కోటేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ రామారావు, డీసీపీ సూరజ్ కుమార్ పాల్గొన్నారు.

దశలవారీగా ఆక్రమణలు తొలగించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో దశలవారీగా రోడ్, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు చేపట్టాలని, ఆక్రమణలు పునరావృతం కాకుండా వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, టీపీబీఓలు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమణలు చేసి ట్రాఫిక్, మురుగుపారుదలకు అడ్డుగా ఉంటున్నాయని, అటువంటి ఆక్రమణలను దశలవారీగా తొలగించడానికి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరిగితే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, టీపీబీఓలదే బాధ్యత అని హెచ్చరించారు. నగరంలో జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఇచ్చిన షార్ట్ ఫాల్స్‌పై నవంబర్ 15లోగా నోటీసులు ఇవ్వాలని, స్పందించని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో అనధికార బ్యానర్లు ఇష్టానుసారం ఏర్పాటు చేస్తుంటే దళం సభ్యులు ఏమి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మారకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. త్వరలో నగరంలో వెండింగ్ జోన్లు, పార్కింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని కోరారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన టెడ్-ఎక్స్ వీవీఐటీ



కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని: వీవీఐటీ విద్యార్థులతో నిర్వహించిన టెడ్ ఎక్స్–వీవీఐటీ విద్యార్థులలో స్ఫూర్తి నింపి, ప్రేరణ కలిగించే విధంగా సాగిందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన టెడ్ ఎక్స్ కార్యక్రమంలో శుక్రవారం ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన తొమ్మిది మంది వారి జీవితానుభవాలను తెలిపి, వారు అధిగమించిన సవాళ్లను విద్యార్థులకు వివరించారు. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని అధిగమించి ఏవిధంగా ముందుకు సాగాలో తెలియజేస్తూ వక్తలు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్టసమయాలలో సరైన మార్గాలు ఎన్నుకునే విధంగా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. కార్యక్రమంలో వక్తలుగా సినీ దర్శకుడు విద్యాధర్ కటిగ, లెంత్రా చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ వికాస్ మెథోక్, ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ శివానంద్‌రెడ్డి, శ్యాంగ్‌శంగ్ సీనియర్ స్టాఫ్ ఇంజినీర్ శౌఘత భట్టాచర్జీ, ఫారెన్సిక్ ప్రొఫెషనల్ త్రిషితా చటర్జీ, పర్యావరణవేత్త, ప్రొఫెసర్ డాక్టర్ అజయ్ కాట్రగడ్డ, వివిఐటి విద్యార్థులు సువిధ, భరత్‌లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పొన్నూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాచవరం, పెదపాలెం గ్రామ పంచాయతీలలో ఆయన పర్యటించారు. గ్రామాల్లో ప్రారంభించిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిబంధనల ప్రకారం సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణం జరిగేలా నిరంతరం పనులను పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. పెదపాలెంలో అమృత సరోవర్ ట్యాంక్, పచ్చల తాడిపర్రులో హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

వర్ధమాన దేశాల ఆకాంక్షలు నెరవేర్చాలి



లక్ష్మీపురం: అగ్ర రాజ్యాలపై పెత్తందారీ పోకడలను అడ్డుకుంటూ వర్ధమాన దేశాల ఆకాంక్షలను నెరవేర్చగలిగితేనే బ్రిక్స్‌కి సార్థకత చేకూరుతుందని విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణం కోసం ఆవిర్భవించిన బ్రిక్స్ కూటమి విశ్వప్రగతి, భద్రత కోసం కలిసి కట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించడం మంచి పరిణామం అన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సీనియర్ అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి మాట్లాడారు.

విచక్షణా రహితంగా పురుగు మందులు వాడొద్దు



పెదకాకాని: మినుము, పెసర వంటి అపరాల సాగులో పురుగు, తెగుళ్ల, దోమ నివారణకు రైతులు విచక్షణా రహితంగా పురుగుమందులు పిచికారి చేయవద్దని వ్యవసాయ కార్యాలయం డీడీఏ డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గ్రామంలో శుక్రవారం రైతులతో కలసి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు అనంతరం సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు మినుము, పెసర వంటి పైర్లకు నాలుగు నుంచి ఐదు రకాల మందులు కలిపి పిచికారి చేయడం వలన మినుము పంటలో ఆకులు గోధుమ రంగులోకి మారిపోతున్నాయని ప్రయోగాత్మకంగా రైతులకు చూపించారు. గోధుమ రంగులోకి మారిన మినుము పంటకు పొటాషియం నైట్రేట్ ఎకరానికి కిలో చొప్పున తగు మోతాదులో నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు డాక్టర్ సీహెచ్ అనిల్ కుమార్, ఏఓ పి.సంధ్యారాణి, వ్యవసాయ విస్తరణాధికారులు ఆర్‌వీ శివాజి, ఎస్.వెంకటశివరావు, వీఏఏలు వి.లక్ష్మి, ఎ.పూర్ణసాయిరామ్, ఎస్‌కే షాహినా పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం..

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



మహేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గుంటూరు పర్యటన నేపథ్యంలో ప్రమాదవశాత్తు గాయపడి గుంటూరు ఆదిత్యనగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మహేష్ చంద్రను శుక్రవారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ వైద్యానికి అయ్యే ఖర్చు భరించనున్నట్లు చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా తమకు కార్యకర్తల సంక్షేమం చాలా ముఖ్యమని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వరకు పార్టీ కార్యకర్తల మంచి చెడులు చూసుకుంటూ ముందుకు సాగడమే తమకు తెలిసిన సిద్ధాంతమని చెప్పారు. ఈ క్రమంలోనే వైఎస్ జగన్ ఆదేశాల మేరకు తాము ఎప్పటికప్పుడు స్వయంగా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి వారి క్షేమ సమాచారాలు తెలుసుకోవడంతో పాటు వారికి అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు మల్లవరపు రవిరాజు(అగ్గిపెట్టె రాజు), అంబేడ్కర్, వంశీ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, నూనె ఉమామహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగను కలిసిన దర్శకుడు దిలీప్‌రాజా



జగ్జీవన్‌రామ్ చిత్రం పోస్టర్‌ను పరిశీలిస్తున్న మంద కృష్ణమాదిగ

నగరంపాలెం: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా కలిశారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయనతో సమావేశమై, జగ్జీవన్‌రామ్ చిత్రంలోని సన్నివేశాలపై చర్చించారు. క్షేత్ర స్థాయిలో జరిగిన యదార్థ సన్నివేశాలపై దృష్టిసారించామని దర్శకుడు ఆయనకు వివరించారు. ప్రవాస భారతీయుడు డాక్టర్ చందోలు నాగమల్లేశ్వరరావు నిర్మిస్తున్నారని అన్నారు. వచ్చేనెల తొమ్మిది నుంచి రెండో షెడ్యూల్ చిత్రీకరణ తెనాలిలో జరుగుతుందని వివరించారు. అదే షెడ్యూల్‌లో మంద కృష్ణమాదిగ నటించనున్నారని దర్శకుడు తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ జైళ్లకు వెళ్లిన సన్నివేశాల చిత్రీకరణ జరగాల్సి ఉందన్నారు. ఈ చిత్రంలో ఏపీలోని ముగ్గురు ఎమ్మెల్యేలు నటించనున్నారని చెప్పారు. చిత్ర సమర్పకుడు చందోలు దేవదాసు, సమన్వయకర్త కాలేబ్‌రాజు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడాలి



క్రీడాపోటీల విజేతలతో కల్నల్ దీపక్‌కుమార్ శర్మ, వరలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి దేశ సమగ్రతను కాపాడే విధంగా ఎదగాలని గుంటూరు ఎన్‌సీసీ కార్యాలయ పరిపాలనాధికారి లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్ శర్మ పేర్కొన్నారు. రింగ్‌రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న క్రీడాపోటీలను ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన దీపక్‌కుమార్ శర్మ మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. ఒత్తిడిని అధిగమించి చదువులో చురుకుదనాన్ని పెంచేందుకు క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. డీఎంహెచ్ఓ కార్యాలయ డీఎస్ఓ డాక్టర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. దీనిని తల్లిదండ్రులు గుర్తెరిగి పిల్లలు సరైన మార్గంలో నడుచుకునే విధంగా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల క్రీడాపోటీలు అలరించాయి. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రైమరీ, సెకండరీ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణి, జెడ్ఈవో వరలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

పట్నంబజారు: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్‌లోని లాలాపేట పోలీసు స్టేషన్‌లో విద్యార్థులకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎ.వి.శివప్రసాద్ పోలీసుల విధుల గురించి విద్యార్థులకు వివరించారు. లాకప్, వైర్‌లెస్‌సెట్, ఆయుధాలు, పోలీసుల పనితీరు గురించి తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. సమాజ రక్షణలో పోలీసుల పాత్ర ఎంత కీలకమో తెలిపారు.

